# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 302
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
సెప్టెంబర్ 12, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## విచారణ చేయండి.. తర్వాతే బిల్లులు చెల్లించండి

- కమిషనర్ కు చెరువుల పరిరక్షణ సొసైటీ వినతి



8లో..



7లో..

## గివ్ బ్యాక్ టు సొసైటీ

- దాతల సాయంతో పాఠశాలు, కాలేజీల అభివృద్ధి
- విద్యార్థులు సౌకర్యాలను వినియోగించుకోవాలి
- పేదరికం చదువుకు అడ్డు కాదు
- ఐపీఎస్ చెన్నూరి రూపేష్





2లో..

## ఈవీఎంల తరలింపు

- గోదాములు తనిఖీ చేసిన కలెక్టర్ సత్య శారదా



## 14న ఎన్డీఏ, సీడీఎస్ పరీక్ష


- ముమ్మరంగా ఏర్పాట్లు
- జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్

8లో..



## రైతుల అరిగోస..

- పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి
- రైతన్నకు అండగా నిలిచిన మాజీ మంత్రి ఎర్రబెల్లి
- అరెస్ట్ చేసిన పోలీసులు



# ఓరుగల్లు పై చిన్నచూపు

## కమలదళంలో దక్కని చోటు

- ప్రాధాన్యం తగ్గించిన రాష్ట్ర కమిటీ
- ఎంతో కాలంగా పనిచేస్తున్నా ఏ ఒక్కరికీ దక్కని పదవులు
- భగ్గుమంటున్న పార్టీ శ్రేణులు
- ఇలా అయితే మనుగడ కష్టమంటున్న క్యాడర్

వివరాలు2లో..

ఓరుగల్లుపై భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూస్తోంది. రాష్ట్రంలో ఆ పార్టీకి హైదరాబాద్ తర్వాత వరంగల్ లోనే అతి పెద్ద క్యాడర్ ఉన్నప్పటికీ కమలదలంలో చోటు దక్కక పోవడం పార్టీ శ్రేణులను నిరాశకు గురి చేస్తోంది. గతంలో పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారికి కూడా ప్రస్తుత కమిటీలో స్థానం కల్పించకపోవడంతో కార్యకర్తలు నిరాశ చెందుతున్నారు. బీజేపీకి ఇక్కడ బలమైన పట్టు ఉన్నప్పటికీ ఆ పార్టీ పెద్దలు పట్టించుకోకపోవడం వెనుక కుట్ర దాగి ఉందంటున్నారు. ఒకవైపు తెలంగాణ ప్రజలకు మేమే ప్రత్యామ్నాయం అని ప్రకటిస్తున్న బీజేపీ నాయకులు ఆ దిశగా అడుగులు వేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జన సంఘ్ నుంచి బీజేపీగా రూపాంతరం చెందిన ఆ పార్టీలో మొదటినుంచి కాకతీయుల గడ్డకు ప్రాధాన్యం ఉండేది. రాష్ట్రంలో బీజేపీకి ఎలాంటి గుర్తింపు లేని సమయంలోనే ఇక్కడినుంచి ఎంపీగా విజయం సాధించిన చరిత్ర ఆ పార్టీకి ఉంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్ గా ఇలా ఎన్నో పదవులను బీజేపీ నేతలకు స్థానికులు అందించినప్పటికీ రాష్ట్ర కమిటీలో ఒక్కరికి కూడా అవకాశం కల్పించకపోవడంపై పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నారు. ఇలా అయితే మనుగడ కష్టమంటూ హెచ్చరిస్తున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

# ఓరుగల్లుపై చిన్నచూపు



- కమలదళంలో దక్కని చోటు
- ప్రాధాన్యం తగ్గించిన రాష్ట్ర కమిటీ
- ఎంతో కాలంగా పనిచేస్తున్నా ఏ ఒక్కరికీ దక్కని పదవులు
- భగ్గుమంటున్న పార్టీ శ్రేణులు
- ఇలా అయితే మనుగడ కష్టమంటున్న క్యాడర్

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీలో ప్రాంతీయ సమతుల్యం లోపించింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ప్రకటించిన నూతన కార్యవర్గంలో ఓరుగల్లుకు తగిన ప్రాధాన్యం దక్కకపోవడంపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాను రాజకీయంగా, పార్టీ పరంగా నిర్లక్ష్యం చేశారని స్థానిక బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారికి కూడా ప్రస్తుత కమిటీలో స్థానం కల్పించకపోవడంతో కార్యకర్తలు నిరాశ చెందుతున్నారు. ఎంతో కాలంగా నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేస్తున్నా తగిన గుర్తింపు లభించలేదన్నది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర నాయకత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన నేతలను పక్కన పెట్టడం సమంజసం కాదని, దీనివల్ల పార్టీకి నష్టం జరుగుతుందంటూ హెచ్చరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తామన్న ఆశతో ఉన్న పార్టీ క్యాడర్ కు ఈ కమిటీ నిరాశ పరిచిందనే చెప్పవచ్చు.




### బలమైన క్యాడర్..

భారతీయ జనతా పార్టీకి ఉమ్మడి వరంగల్ జిల్లాలో బలమైన క్యాడర్ ఉంది. వరంగల్ తూర్పు నియోజకవర్గంతోపాటు వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గత అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి పోటీనే ఇచ్చారు. సమీకరణాలు అనుకూలించక ఓటమి పాలయ్యారు తప్ప క్యాడర్ మాత్రం వారి వెంటే ఉంది. గతంలోనూ ఎందరో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్ గా విజయం సాధించి ప్రజలకు పార్టీని మరింత చేరువ చేశారు. వారంతా పార్టీకి వివిధ హోదాల్లో సేవలు అందించారు. పార్టీ అభివృద్ధికి నిష్ఠతో కృషి చేస్తున్నా ఏ ఒక్కరికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కకపోవడం నివాశకు గురిచేస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, వామ పక్ష పార్టీలకు ఎదుర్కొంటూ పార్టీని బతికిస్తున్నా ఆవకాశాలు రాకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. త్వరలో జరుగనన్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు నిర్విరామ కృషి చేస్తున్నప్పటికీ అధిష్ఠానం అవకాశాలు కల్పించకపోవడంతో కస్సు, బుస్సు మంటున్నారు.

### క్యాడర్ కు గుర్తింపేది..?

గత కొన్ని సంవత్సరాలుగా పార్టీ కోసం క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా పనిచేస్తున్నాం.. పార్టీ ఆదేశాల మేరకు ఎప్పుడు ఎలాంటి కార్యక్రమానికి పిలుపునిచ్చినా తూరా తప్పకుండా పాటిస్తున్నాం. అయినప్పటికీ మేము రాష్ట్ర కమిటీలో పనిచేయడానికి పనికిరానోళ్లమయ్యామా అంటూ ప్రశ్నిస్తున్నారు. మాతో గొడ్డుచాకిరీ చేయిస్తూ పదవులేమో ఇతరులకు ఇస్తారా అంటూ మండిపడుతున్నారు. కమిటీలో అవకాశం కల్పించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నాయకులే కరువయ్యారా అంటూ నిలదీస్తున్నారు. 'పార్టీ కోసం లాఠీ దెబ్బలు తిన్నవాళ్లు.. ప్రాణాలకు తెగించి కొట్లాడినవాళ్లని కాదని, కేవలం ఆఫీసుకే పరిమితమయ్యేవారికి కమిటీలో చోటు కల్పించడం దురదృష్టకరం అంటున్నారు. ప్రస్తుతం వరంగల్ లో బీజేపీ శ్రేణుల నిరసన సెగ పార్టీ నాయకత్వానికి కొత్త తలనొప్పి తెచ్చిపెట్టిందనే చెప్పవచ్చు. ఈ పరిణామంపై పార్టీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందో, కార్యకర్తలను ఎలా బుజ్జగిస్తుందో వేచి చూడాలి.

# ఈవీఎంల తరలింపు

- గోదాములు తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ( ఈవీఎంల)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శుక్రవారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్లమెంట్ ఎన్నికలలో వినియోగించిన ఈవీఎంలను భద్రపర్చిన గోదాంను కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తనిఖీ చేశారు. భద్రత చర్యలో భాగంగా అనంతరం వాటిని జిల్లా వేర్ హౌజ్ కు తరలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లాకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, రమాదేవి, తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఎస్ పీ నుంచి అనిల్, టీడీపీ నుంచి శ్యామ్, ఏఐఎంఐఎం నుంచి ఫైజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సీరియస్

- డీఎం, ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జికి నోటీసులు
- ఆదేశాలు జారీ చేసిన సత్య శారద
- మండల బియ్యం నిల్వ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముక్కిన బియ్యంతోపాటు విద్యార్థులకు సరఫరా చేయాల్సిన మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని ఒకే ప్రాంతంలో నిల్వచేయడంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సీరియస్ అయ్యారు. శుక్రవారం ఏనుమాములలోని బియ్యం నిల్వ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బియ్యం నిల్వ కేంద్రంలో ఉంచిన బియ్యం నాణ్యత, నిల్వ విధానం, భద్రతా ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ముక్కిన బియ్యం, విద్యార్థులకు సరఫరా చేసే మధ్యాహ్న భోజన పథకం బియ్యం ఒకే ప్రాంతంలో నిల్వ ఉంచడాన్ని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పౌరసరఫరాల డీఎం, ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జికి శ్రీముఖాలు జారీ చేయాలంటూ అదనపు కలెక్టర్ ను ఆదేశించారు. తనిఖీల్లో పట్టుబడిన బియ్యాన్ని వెంటనే వేలం వేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.




# గాంధీ లక్ష విగ్రహాల ప్రదర్శన

- జనగామ వాసులకు ఆహ్వానం

**వరంగల్ వాయిస్, జనగామ :** వచ్చే నెల హైదరాబాద్ లో జరిగే లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శనలో జనగామ జిల్లా నుంచి అధిక సంఖ్యలో గాంధీ అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయగలరని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కలసాని సంజయ్ రెడ్డి కోరారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా అక్టోబర్ 10 నుంచి 14 వరకు నిర్వహించే ఈ వేడుకల్లో రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా పాల్గొంటారన్నారు. ఈ వేడుక గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకోనుంది. ఈ సందర్భంగా సంజయ్ రెడ్డి టీమ్ సభ్యులు గత కొంత కాలంగా పూర్వ నల్లగొండ, వరంగల్ జిల్లాలలో పర్యటిస్తూ శుక్రవారం జనగామకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత పోస్టర్ ను ఆవిష్కరించారు. గాంధీ లక్ష విగ్రహాల ప్రదర్శన వేడుకలో జనగామ నుంచి అధిక సంఖ్యలో పాల్గొంటామని జిల్లా బాధ్యులు కన్నపరశురాములు, గూడూరు మదన్ మోహన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నమిల శంకర్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ముద్దండి రవితేజరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి అనిపెద్ది శ్రీకాంత్, యువజన విభాగం రాష్ట్రం ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి రాజ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి సిద్దం శివ, జనగాం జిల్లా కార్యదర్శి మంగా వెంకటేశ్వర్లు, మంగ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు రక్షణగా పోక్సో చట్టం

◆ జిల్లా కోఆర్డినేటర్ డి.కళ్యాణి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం 10 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా దామెర మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ డి.కళ్యాణి మాట్లాడుతూ, మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై 10 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా వివిధ చట్టాల గురించి వివరిస్తూ, ప్రేమ పేరుతో పిల్లలు మోసపోతున్నారని, సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగిస్తున్నారని అన్నారు. పిల్లలపై లైంగిక నేరాల నివారణకు ఉద్దేశించినదే పోక్సో (POCSO) చట్టం అని ఆమె స్పష్టం చేశారు. ఈ చట్టం గురించి బాలికలు, బాలురు తప్పనిసరిగా తెలుసుకోవాలని ఆమె సూచించారు. పోక్సో కింద కేసు నమోదు చేస్తే విధించే శిక్షల గురించి కూడా వివరించారు. అలాగే, బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి ప్రస్తావించి, ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఆడ, మగ



సమానమేనని, ఆడపిల్లలకు రక్షణగా ఉండాలని కోరారు. పిల్లలకు ఏదైనా సమస్య ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్లు 100, 1098, 181, 1930 లకు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పోక్సో చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేష్, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది మానస, లావణ్యలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన కొల్లూరి ఆదిత్య సాయి




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** 'వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ' లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీజేపీని బలోపేతం చేసేందుకు యువత ఆకర్షితులవుతున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని హంటర్ రోడ్, దీన్ దయాళ్ నగర్‌లో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, హనుమకొండ న్యూ శాయంపేటకు చెందిన న్యాయ విద్య పట్టభద్రుడు కొల్లూరి ఆదిత్య సాయి బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా కొలను సంతోష్ రెడ్డి, రావు పద్మ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ 31వ డివిజన్ అధ్యక్షులు కడవేరు శ్రీనివాస్, జిల్లా నాయకులు నర్మెట్ట శ్రీనివాస్ రావు గౌడ్, సంద్ర మధు, కేతిపెల్లి సంపత్ రెడ్డి, కూతురు రాజు, అరణ్యారెడ్డి, రుత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో వొడితల ప్రణవ్ పర్యటన



**వరంగల్ వాయిస్, హుజూరాబాద్ :** పట్టణంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ శుక్రవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు కృషి చేస్తామని తెలిపారు. త్వరలోనే హుజూరాబాద్ నాలాలపై బ్లూప్రింట్ తయారు చేసి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గాంధీనగర్, బుడగ జంగాల కాలనీ, మామిండ్లవాడ, గ్యాస్ గోదాం ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికులు తమ సమస్యలను ప్రణవ్ దృష్టికి తీసుకురాగా, వాటిని అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వరద సమస్యపై శాశ్వత పరిష్కార ప్రణాళిక సిద్ధం చేసేలా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని ఆయన తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను ఫంక్షన్ హాల్‌లకు తరలించే విధంగా అధికారులకు, పార్టీ నాయకులకు సూచనలు చేశానని ప్రణవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ కమిషనర్ సమ్మయ్య, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్



**వరంగల్ వాయిస్, వరంగల్:** శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) వరంగల్ జిల్లా కార్యదర్శి లాదెళ్ల శరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఈ మేరకు వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) విజయలక్ష్మికి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్ భవనాలు కూలిపోయే ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత భవనాలు లేక శిథిలావస్థలో ఉన్న విద్యాసంస్థల్లో విద్యార్థులు భయపడుతూ చదువుకుంటున్నారని తెలిపారు. జిల్లాలోని స్టూడెంట్ మేనేజ్ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు లేనందున, వాటికి కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా, హాస్టళ్లలో ఉన్న విద్యార్థులకు వెంటనే దుప్పట్లు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి, భరత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐలయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 65వ డివిజన్‌లోని మునిపెల్లి గ్రామంలో ఇటీవల మరణించిన సాయిని ఐలయ్య కుటుంబాన్ని పదవరోజున పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నద్దునూరి కిషన్, పార్టీ కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఐలయ్య మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# జిల్లా సబ్–జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక

**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల (జడ్పీహెచ్ఎస్) చాగల్లు ఆవరణలో ఈ నెల 14న సబ్–జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రకటించింది. ఉదయం 10 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయి. ఈ వివరాలను జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి, అధ్యక్షులు వై. కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి తోటకూరి గట్టయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలోని ముప్కల్ లో జరగబోయే 35వ సబ్–జూనియర్స్ అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారు. మరిన్ని వివరాలకు డాక్టర్ టి. వెంకటేశ్వర్లు (జాయింట్ సెక్రటరీ) 9441636095, సుధాకర్ (టెక్నికల్ ఆఫీషియల్ చైర్మన్) 9010255898 నెంబర్లను సంప్రదించవచ్చు.

# రంయ్యాలకు కాళోజీ సాహిత్య స్ఫూర్తి పురస్కారం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని పోచమ్మ మైదానం సమీపంలో గల ఎల్.బీ.నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ వ్యాఖ్యాత, గాయకులు రంయ్యాల శ్రీధరాచార్యులకు గీత ఆర్ట్స్ అకాడమీ – గీతా ఫౌండేషన్ వారిచే కాళోజీ సాహిత్య స్ఫూర్తి పురస్కారం అందజేశారు. విద్యా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన విశిష్ట సేవలకు గాను ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గీత ఆర్ట్స్ అకాడమీ – గీతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతి మెయిన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కళా పత్రిక సంపాదకులు, అవార్డు కమిటీ చైర్మన్ డాక్టర్ మహ్మద్ రఫీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ చైర్మన్ జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సమాజానికి కాళోజీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పురస్కార గ్రహీతలు వారి వారి రంగాల్లో అందిస్తున్న విశేష సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, ప్రముఖ నవలా రచయిత, రంగస్థల నటుడు మత్తి భానుమూర్తి, కొండూరు



హరినారాయణ తదితరులు పాల్గొన్నారు. శృతి లయ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని, గీత ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు గీత కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీధరాచార్యులు ఇప్పటివరకు రెండు వందలకు పైగా అవార్డులు, ఐదు వందలకు పైగా సన్మానాలు అందుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు, అక్కినేని నాగేశ్వరరావు, డాక్టర్ సి.నారాయణ రెడ్డి, సినీ నటులు సుమన్, బాబుమోహన్ వంటి ప్రముఖుల చేతుల మీదుగా ఆయన సన్మానాలు పొందారు. ఆయన పాడిన 'బడిబాట' పాట "రారా బడికి రా" ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విశేష ప్రాచుర్యం పొందింది. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని శ్రీధరాచార్యులు పేర్కొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని డిస్నీల్యాండ్ స్కూల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న పైండ్ల సూరయ్య (మాదారం, పరకాల) గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరయ్య తన చిన్న కూతురు ఊరైన రామచంద్రాపురం వెళ్లి, తిరిగి బస్సులో డిస్నీల్యాండ్ స్కూల్ వద్దకు చేరుకున్నారు. బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆయన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూరయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి కోడలు పైండ్ల సంధ్య శుక్రవారం దామెర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై అశోక్ దర్యాప్తు చేపట్టారు.

# చేనేత కార్మికుల సమస్యలకు పరిష్కారమెప్పుడు?

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ఎప్పుడు పరిష్కరిస్తుందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడుస్తున్నా చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికులకు రూ. లక్ష వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, నిధులు కూడా విడుదల చేసినట్లు ప్రకటించినా, ఇంతవరకు ఏ ఒక్క కార్మికుడికీ రుణమాఫీ కాలేదన్నారు. వెంటనే బ్యాంకుల నుండి కార్మికుల రుణాల పూర్తి వివరాలు సేకరించి, అన్ని రకాల రుణాలను మాఫీ చేసి, తిరిగి రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.చేనేత అభయహస్తం పథకం కింద జియో ట్యాగ్ ఉన్న కార్మికుడికి రూ. 9 వేలు, అనుబంధ కార్మికుడికి రూ. 3 వేలు మొదటి విడతగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్న వాగ్దానం అమలు కోసం కార్మికులు ఎంతకాలం ఎదురు చూడాలని ఆయన ప్రశ్నించారు. అలాగే, త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద ప్రభుత్వం జమ చేయాల్సిన డబ్బులను ప్రతి నెలా కార్మికుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు.

# భూ నిర్వాసితులకు నష్టపరిహారంపై సమీక్ష



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మామునూరు విమానాశ్రయం నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన గాడిపల్లి గ్రామ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ సమావేశంలో ఇళ్లు కోల్పోయిన 12 మంది భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుల విధానంపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఈస్ట్ వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, సంబంధిత సిబ్బందితో పాటు భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొయ్యడ లక్ష్మీప్రభాకర్ శుక్రవారం బోన్ క్యాన్సర్‌తో మరణించిన మరికుకాల వసంత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వసంత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీప్రభాకర్ మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని, పిల్లల చదువులకు తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కష్టకాలంలో వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మినుముల వెంకట్ రెడ్డి, కందుల అనిల్ కుమార్, మరికుకాల సారయ్య, శ్రీనివాస్, ఇస్తారీ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

## ◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని 4వ డివిజన్ జ్యోతి బసు నగర్, 53వ డివిజన్ సరస్వతి నగర్‌లలో రూ. 92.50 లక్షలతో అంతర్గత రహదారులు, సైడ్ డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నానని, ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. శంకుస్థాపన చేసిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో వర్షాకాలం వస్తే 'వరదలో హనుమకొండ' అనే వార్తలు ఎక్కువగా వచ్చేవని, అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరద ప్రభావిత ప్రాంతాలను గణనీయంగా తగ్గించగలిగామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలిచేలా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని, ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబేద్కర్ రాజు, జిల్లా ఆర్టీఏ సభ్యుడు పల్లకొండ సతీష్, మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, ఎర్రం మహేందర్, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, బాబాయ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ జిల్లా క్రీడాకారుల ప్రభంజనం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** నిర్మల్ జిల్లాలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగిన ఆరవ తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ సబ్–జూనియర్, జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జిల్లా యోగా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో హైదరాబాద్ జిల్లా నుంచి జ్యోతిర్మయి సూత్ర ఒక గోల్డ్, ఒక సిల్వర్ మెడల్ సాధించారు. వీరి కోచ్ మోహన్ సూత్ర. అలాగే, ఐ.ప్రహర్ష ఒక సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. వీరి కోచ్ స్నేహ. శ్రీచరిత, ఎం.రోహిత్ సాయిబాబా మెరిట్ సాధించారు. వీరికి కోచ్‌లు రసజ్ఞ, భార్గవ్ శిక్షణ ఇచ్చారు. విజేతలను తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, జాయింట్ సెక్రటరీ యోగారామ్ రెడ్డి, టెక్నికల్ కార్యదర్శి తోట సతీష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా టెక్నికల్ సంయుక్త కార్యదర్శి స్నేహ, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సాంకేతిక సంయుక్త కార్యదర్శి స్వప్న, జడ్జి పూరెల్లి సంతోష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ వివరాలను హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జయరాజ్ ఆర్యన్ ఒక ప్రకటనలో తెలిపారు.

# టైఫాయిడ్‌కు నివారణే మార్గం

## లయన్ కన్న పరశురాములు




**వరంగల్ వాయిస్, జనగామ:** టైఫాయిడ్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు నివారణ చర్యలే ఉత్తమ మార్గమని లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు అన్నారు. గురు, శుక్రవారాలలో స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాలలో లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్, సురక్ష వెల్ఫేర్ సొసైటీ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన టైఫాయిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ జె. థామస్, క్లబ్ అధ్యక్షుడు కారంపూడి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సీజన్ మారే సమయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ వ్యాక్సినేషన్ శిబిరంలో 500 మంది విద్యార్థులకు రాయితీతో టైఫాయిడ్ వ్యాక్సిన్ వేశారు. ఉపాధ్యాయులు రాజిరెడ్డి, ప్రమీల, నర్మద ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పులుగం సురేశ్ కుమార్, కోశాధికారి సుదగాని ప్రవీణ్ కుమార్, సురక్ష వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ కరుణాకర్, డా. కార్తీక్, సభ్యులు అరుణ్, సిద్ధు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

## ◆ గురుకులాల ఆర్సీఓ మోతే రాజుకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి అత్యంత గొప్పదని, గురువులు ఎల్లప్పుడూ పూజనీయులని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ మోతే రాజుకుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ థౌజెండ్ పిల్లర్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్, టీచర్స్ హానరింగ్ చైర్మన్ జనగామ అంజిరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాజుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైన వ్యక్తులను తీర్చిదిద్దేది గురువులేనని, వారి సేవలను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. లయన్స్ జిల్లా మొదటి ఉప గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గురుపూజోత్సవం నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం తమ క్లబ్ ఆనవాయితీ అని తెలిపారు. లయన్స్ జిల్లా రెండవ ఉప గవర్నర్ పుట్టా హరికిషన్ రెడ్డి మాట్లాడుతూ, గురువుల సహకారంతోనే మనం సమాజంలో ఉన్నతంగా జీవించగలుగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వైద్యం రాజు గోపాల్, జోన్ చైర్మన్ సీహెచ్.సోమయ్య, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ యు. అమర్‌నాథ్, క్లబ్ అధ్యక్షుడు పరికిపండ్ల వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంగళ మురళి, తిరునగరి నరేందర్, దేవసాని సవిత, పాము జ్యోతి తదితర ప్రధానోపాధ్యాయులను, డాక్టర్ గుజ్జారి రమేష్, పాము శ్రీనివాస్, కక్కెర్ల నాగరాజు, పెండెం వేణుమాధవ్ వంటి విద్యాసంస్థల కరస్పాండెంట్‌లను సత్కరించారు. అలాగే, ఎం.జె.పి. కళాశాల అధ్యాపకులు కొండ హనుమాన్ ప్రసాద్, ఆర్.మహాదేవ రెడ్డి, జంగ తిరుపతి రెడ్డి, భార్గవి వరలక్ష్మి, స్వప్న, ధనలక్ష్మి, మానస, రజితలకు జ్ఞాపిక, దుశ్శాలువ, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత నృత్యం, కూచిపూడి నృత్యాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, మధుసూదన్ రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూం ఇళ్లలో సమస్యలు పరిష్కరిస్తా

◆ అధికారులతో కలసి ఎమ్మెల్యే నాయిని పరిశీలన
◆ ప్రజల మధ్యలోనే స్థితిగతులపై సమీక్ష

**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం బాలసముద్రంలోని ఇందిరమ్మ రెండు పడకల ఇళ్ల కాలనీని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికార యంత్రాంగంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షించారు. ముఖ్యంగా విద్యుత్తు, మంచి నీరు, డ్రైనేజీ వ్యవస్థలపై దృష్టి సారించి, యుద్ధప్రాతిపదికన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇళ్లు కేటాయించిన తర్వాత విద్యుత్, నీటి సరఫరాను అందిస్తామని చెప్పారు. ఇళ్ల పట్టాల పంపిణీ తర్వాత జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎంపీ, మేయర్, కుడా చైర్మన్, అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించామని అన్నారు. ప్రాధాన్యత ప్రకారం తొలుత విద్యుత్ సరఫరా కోసం రూ. 45 లక్షల నిధులు మంజూరు చేశామని, వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని





తెలిపారు. మంచి నీటి సరఫరా కోసం ఇప్పటికే ఉన్న పైపులైన్‌లకు అనుసంధానం చేసి, సంపులకు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.

### అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం..

ఇళ్ల పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని, అయితే ఇంకా కొందరికి ఇళ్లు కావాలని తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. రాబోయే రోజుల్లో ఇక్కడ అర్హత కలిగిన వారికి తప్పకుండా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సొంత ఇంటి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో అర్హులుగా ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రస్తుతానికి బాలసముద్రంలో ఇళ్లు లేవని, దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. గతంలో కొందరు దళారులు పెద్దమనుషులుగా చలామణి అవుతూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారని, వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరైనా మోసపోయినట్లయితే ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని, వెంటనే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# విధుల్లో చేరిన జీపీఓలు



**వరంగల్ వాయిస్, దామెర:** ప్రజా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన గ్రామ పరిపాలన అధికారులు (జీపీఓలు) దామెర మండలంలో విధుల్లో చేరారు. మొత్తం ఎనిమిది మందికి గాను ఏడుగురు జీపీఓలు తమ విధులను ప్రారంభించినట్లు మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్‌ఓ) జ్యోతి వరలక్ష్మి దేవి తెలిపారు. శుక్రవారం దామెర తహసీల్దార్ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన జీపీఓలకు వారు పనిచేయాల్సిన గ్రామాలను కేటాయించారు. దామెర గ్రామానికి సురేష్, లాదెళ్ల గ్రామానికి భీష్మ, పసరగొండకు సంతోష్, ఒగ్లాపూర్‌కు హరిప్రసాద్, ఊరుగొండకు విజయేందర్, ముస్తాలపల్లికి చంద్రమోహన్, పులుకుర్తికి ప్రశాంత్ లు పనిచేస్తారు. ఈ సందర్భంగా ఎంఆర్‌ఓ జ్యోతి వరలక్ష్మి దేవి మాట్లాడుతూ జీపీఓలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో జరిగిన హత్య కేసులో నిందితుడు పాలత్య రమేష్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బి. అపర్ణా దేవి శుక్రవారం తీర్పు ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల ప్రాంతానికి చెందిన నిందితుడు రమేష్, మృతుడు యంజాల శివ స్నేహితులు. వీరిద్దరూ చిల్లర దొంగతనాలు, కూలీ పనులు చేసి వచ్చే డబ్బును సమానంగా పంచుకునేవారు. అయితే, వారి మధ్య తరచుగా గొడవలు జరుగుతుండేవి. 2023 సెప్టెంబర్ 11న మరోసారి గొడవ జరగడంతో, రమేష్ శివను చంపాలని పథకం వేశాడు. అదే రోజు రాత్రి అశోక జంక్షన్‌లోని యూనియన్ బ్యాంక్ భవనంపై శివను కర్రతో తీవ్రంగా కొట్టి, భవనం పైనుంచి తోసి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న హనుమకొండ పోలీసులు దర్యాప్తు చేసి, కచ్చితమైన సాక్ష్యాధారాలు, చార్జిషీటుతో పాటు సాక్షులను సరైన సమయంలో కోర్టులో హాజరుపరిచారు. దీంతో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష పడింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి, కోర్టు లైసన్ అధికారులు ఏఎస్ఐ పరమేశ్వరి, హెడ్ కానిస్టేబుల్ కుమార్‌స్వామి, కోర్టు కానిస్టేబుల్ సుభాష్, ప్రాసెస్ డ్యూటీ హోంగార్డు మక్బూల్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

# 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వరంగల్ వాయిస్, గణపురం:** గణపురం, చెల్పూర్, కొండపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో రేపు, అనగా 13 శనివారం నాడు, విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ కె. వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసి, తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

# కాళేశ్వరం-పలుగుల డబుల్ రోడ్డుకు రూ. 22 కోట్లు మంజూరు

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్:** మంథని నియోజకవర్గంలోని కాళేశ్వరం నుంచి పలుగుల గ్రామం వరకు ఏడు కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 22 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు రోడ్డు భవనాల శాఖ ద్వారా మంజూరైనట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కాళేశ్వరం నుంచి పలుగుల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల స్థానికులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఆయన అన్నారు. కాళేశ్వరం-పలుగుల డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో పలుగుల, కుంట్లం, కాళేశ్వరం, మద్దులపల్లి గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య భద్రత

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 'డ్రై డే' కార్యక్రమంలో భాగంగా మలేరియా హెల్త్ అసిస్టెంట్ పి.బాబు ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లో నీరు నిల్వ ఉన్న గుంతలలో ఆయిల్ బాల్స్ వేసి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ వర్షాకాలంలో ఇళ్లలో పనికిరాని వస్తువులలో నీరు నిలిచిపోవడం వల్ల దోమలు పెరిగి ప్రజలకు హాని కలిగిస్తాయని అన్నారు. ప్రస్తుతం డివిజన్‌లో అనేక మంది జ్వరం, దగ్గు, జలుబు, డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. ఇంటిలోని చెత్తాచెదారాన్ని నిల్వ ఉంచుకోకుండా మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని కోరారు. కొంతమంది నిర్లక్ష్యం వల్ల డ్రైనేజీలలో చెత్త వేయడం వలన నీరు బయటికి వెళ్లకుండా నిలిచిపోయి, ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండి, దోమలు పుట్టుకకు కారణమవుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.బాబు, మలేరియా సిబ్బంది ప్రదీప్, రాజు, సాయి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# యువతీ, యువకులు సన్మార్గంలో పయనించాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** యువతీ యువకులు సన్మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలోని చౌళ్లపల్లి, నీరుకుల్ల పాఠశాలల్లో విద్యార్థులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రహసిత్ మాట్లాడుతూ పరీక్షలంటే భయపడకుండా ఒక క్రమ పద్ధతిలో సరైన సమయాన్ని కేటాయించి సబ్జెక్టుల వారీగా చదువుకోవాలని సూచించారు. "పాస్ అవుతామో, ఫెయిల్ అవుతామో" అనే భయాందోళనలకు గురికాకుండా ఉండాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో చదువుకోవడంతో పాటు, గత పరీక్షల పేపర్లను ఎక్కువగా సాధన చేయాలని సూచించారు. అలాగే, విద్యార్థులు బీడీలు, సిగరెట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల జరిగే నష్టాలను ఆయన వివరించారు. చెడు వ్యసనాలకు బానిసలు అయినా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నా, ఆత్మహత్య ఆలోచనలు వచ్చినా 14416 టెలీమానస్ నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్ మాస్టర్లు నిర్మల, దుర్గప్రసాద్, పల్లె దవాఖాన డాక్టర్ పుష్పలీల, హెల్త్ సూపర్వైజర్లు సంపత్, రాజ్యలక్ష్మి, సోషల్ వర్కర్ నరేష్, ఏఎన్ఎంలు లక్ష్మి, మమత, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడోత్సవాలు విజయవంతం

**వరంగల్ వాయిస్, చిట్యాల:** మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) క్రీడోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఎస్జీఎఫ్ మండల కన్వీనర్, ఎంఈఓ కొడెపాక రఘుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు, క్రీడలు రెండు కళ్లలాంటివని అన్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని చెప్పారు. ఎస్జీఎఫ్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ సూదం సాంబమూర్తి మాట్లాడుతూ, అండర్-14, అండర్-17 విభాగాల్లో మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడల్లో 450 మంది బాల బాలికలు పాల్గొన్నారని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జోనల్ స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ లావుడియ జైపాల్, జిల్లా డీవైఎస్ఓ చిర్రా రఘు హాజరయ్యారు.



విద్యార్థులు క్రీడలను ఆస్వాదించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఉన్నత పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి, ఫిజికల్ డైరెక్టర్లు సూదం సాంబమూర్తి, బండి ప్రసాద్, నూకల లింగయ్య, గాజర్ల శ్రీనివాస్, స్వరూపారాణి, ఉమ, వెన్నెల, శారద, అశోక్, చెట్టి భాస్కర్, నరేష్, సంఘ రఘుపతి, సీఆర్‌పీ నరేష్, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 13న విద్యుత్ సరఫరా నిలిపివేత



**వరంగల్ వాయిస్, దామెర:** మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో నెలవారీ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సహాయ ఇంజనీర్ గుర్రం రమేష్ తెలిపారు. రేపు (రెండవ శనివారం) ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలైన దామెర, ల్యాదెళ్ల, వెంకటాపూర్, సింగరాజుపల్లి, ఒగ్లాపూర్, దమ్మన్నపేట, తక్కళ్లపాడు, ముస్త్యాలపల్లి గ్రామాల్లో విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఘనంగా లక్ష్మీ గణేష్ బేకరీ ప్రారంభం



**వరంగల్ వాయిస్, భీమారం :** హనుమకొండ భీమారం చింతగట్టు క్యాంప్ వద్ద వేల్పుల సుధాకర్‌కు చెందిన లక్ష్మీ గణేష్ బేకరీ, టీ పాయింట్‌ను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు బేకరీ యజమాని వేల్పుల సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో కష్టపడి, విలువలతో కూడిన వ్యాపారం చేయాలని, తద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని కుటుంబానికి అందించాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన తక్కళ్లపల్లి శ్రీనివాసరావును, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, మామిండ్ల శ్రీను, వేల్పుల కుమార్, తాళ్లపల్లి రోహిత్, రఘు, రాజు, సతీష్, అనిల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి




**వరంగల్ వాయిస్, సంగెం :** మండలంలోని వెంకటాపురం గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగోల వెంకటరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, బాల వికాస చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల వికాస సంస్థతో తనకు చాలా సంవత్సరాలుగా అనుబంధం ఉందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో ఈ సంస్థ ముందుంటుందని కొనియాడారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా బాల వికాస పనిచేయడం అభినందనీయమని తెలిపారు. రాబోయే రోజుల్లో బాల వికాస ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందాలని ఆయన ఆకాంక్షించారు.




## బీజేపీ, బీఆర్ఎస్ దొందు దొందే: ప్రణవ్




**వరంగల్ వాయిస్, హుజూరాబాద్ :** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు అంతర్గతంగా ఒప్పందం ఉందని, ఈ విషయాన్ని బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత గతంలోనే బహిరంగంగా చెప్పారని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి ఒడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తూ తన రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ప్రణవ్ మండిపడ్డారు. కవిత లిక్కర్ స్కాం కేసులో బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఇంటికి కేటీఆర్ వెళ్లి, బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయడానికి సుముఖంగా ఉన్నట్లు చెప్పారని, ఈ విషయం మీడియా ద్వారానే వెలుగులోకి వచ్చిందని ప్రణవ్ గుర్తు చేశారు. దీనిపై ఇంతవరకు బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. ఇతరుల గురించి మాట్లాడే ముందు తమ గురించి ఆలోచించుకోవాలని కౌశిక్ రెడ్డికి సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి, స్కాంల ప్రభుత్వమైతే, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమని, పేదలకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తుందని అన్నారు. వసూళ్లకు పాల్పడే చరిత్ర ఎవరిదో హుజూరాబాద్ ప్రజలకు బాగా తెలుసని ప్రణవ్ అన్నారు. కాంగ్రెస్ నాయకులైన చెల్పూర్ మహేందర్, మహిపాల్ రెడ్డి దగ్గర ఉద్యోగాల పేరుతో కౌశిక్ రెడ్డి డబ్బులు వసూలు చేసింది అందరికీ తెలుసని ఆరోపించారు. ఈ విషయం అందరికీ తెలిసినా ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరోపణలు చేయడం, ఆ తర్వాత వాటి నుంచి తప్పించుకోవడం కౌశిక్ రెడ్డికి బాగా తెలుసని, హుజూరాబాద్ ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా చూస్తున్నామని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని ప్రణవ్ భరోసా ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు యూరియా సరఫరాపై నివేదికలు అందజేశామని తెలిపారు. యూరియా సరఫరా కేంద్రం నుంచి రావాలని బీజేపీ ఎంపీలే చెబుతున్నా, ఆ విషయం కూడా తెలియకుండా కౌశిక్ రెడ్డి మాట్లాడుతున్నారని, ఇది ఆయన రాజకీయ అవివేకానికి నిదర్శనమని ప్రణవ్ విమర్శించారు. అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి యూరియా కొరత తగ్గించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

## రైతులకు యూరియా అందించాలి

◆ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ గార్ల, డోర్నకల్ మండలాల్లో యూరియా సరఫరా, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో యూరియా పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గార్ల ప్రాథమిక సహకార సొసైటీ, ములకనూరు, డోర్నకల్ మండలం గొల్లచర్ల సొసైటీలలో యూరియా పంపిణీని ఆయన స్వయంగా పరిశీలించారు. రైతులు యూరియా పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే యూరియాను పోలీస్, వ్యవసాయ, సహకార శాఖల సిబ్బందితో కలిసి వేగంగా సరఫరా చేయాలని సూచించారు. రైతులకు త్రాగునీరు, టెంట్లు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. గార్ల కేజీబీవీని





సందర్శించిన కలెక్టర్, తరగతి గదులు, పరిసరాలు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు డైట్ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. డోర్నకల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో సబ్ సెంటర్ పరిధిలోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాతా శిశు మరణాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు డిపిఓ హరిప్రసాద్, నరసింహమూర్తి, స్థానిక తహసీల్దార్లు శారద, ఇమ్మానియేల్, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సేవకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కార్పొరేట్ సంస్థలు పేద ప్రజల సేవ కోసం ముందుకు రావాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో, మెడికవర్ హాస్పిటల్ సహకారంతో హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులు, బధిర పిల్లలకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ క్షమాదేష్ పాండే, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మెడికవర్ హాస్పిటల్ వారిని ఉచిత వైద్య సేవలు అందించమని కోరగా, వారు సానుకూలంగా స్పందించి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్ వైద్యులు పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వైద్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అంతేకాకుండా, ఇకనుంచి ప్రతినెలా పీడియాట్రిక్ సేవలను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, పిల్లలకు పండ్లు, స్నాక్స్ అందించారు. మెడికవర్ హాస్పిటల్ సేవలను క్షమాదేష్ పాండే మరియు డాక్టర్ అనితా రెడ్డి ప్రశంసించి, వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రతి ఒక్క కార్పొరేట్ ఆసుపత్రి పేదలకు సేవ చేయడానికి ముందుకు రావాలని, మెడికవర్ హాస్పిటల్ ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిందని అభినందించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అనేది చట్టంలోనే పొందుపరచబడి ఉందని గుర్తు చేశారు. ఈ శిబిరంలో 150 మంది మానసిక దివ్యాంగ పిల్లలకు, మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్లు డాక్టర్ అశ్రీత రావు (పిల్లల వైద్య నిపుణులు), డాక్టర్ కస్తూరి ప్రమీల (స్త్రీల వైద్య నిపుణులు) వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, మల్లికాంబ సంస్థ నిర్వాహకులు కోడం కళ్యాణ్ పాల్గొన్నారు.

# గివ్ బ్యాక్ టు సొసైటీ

- దాతల సాయంతో పాఠశాలు, కాలేజీల అభివృద్ధి
- విద్యార్థులు సౌకర్యాలను వినియోగించుకోవాలి
- పేదరికం చదవుకు అడ్డు కాదు
- ఐపీఎస్ చెన్నూరి రూపేష్

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** విద్యార్థులకు చదువుకు పేదరికం అడ్డు కాదని, దృఢ సంకల్పంతో లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఈగల్ ఎస్పీ, ఐపీఎస్ అధికారి చెన్నూరి రూపేష్ అన్నారు. హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో మహర్షి ఫౌండేషన్ ద్వారా నిర్మించిన ఆధునిక ఆడిటోరియం, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ తాను చదువుకున్న ఈ పాఠశాలకు తన వంతు సహాయం అందించాలనే గొప్ప ఆలోచనతో ముందుకు వచ్చానని తెలిపారు. గత సంవత్సరం నుంచి పాఠశాలను సందర్శిస్తూ, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, నాయకులతో చర్చించి విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులపై సలహాలు, సూచనలు తీసుకున్నానని చెప్పారు. ఈ సలహాల మేరకు 'మహర్షి ఫౌండేషన్' పేరుతో నిధులు సేకరించి దాదాపు రూ. 42 లక్షల వ్యయంతో ఈ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు.

## దాతల సాయంతో పనులు..

కంప్యూటర్ ల్యాబ్‌ను హైదరాబాద్‌లోని బ్లోవ్ చీవ్ టెక్నాలజీ సంస్థ సీఈఓ అరుణ్ స్పాన్సర్ చేయగా, లైబ్రరీని అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్లు కె. నిత్యానంద రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, సదానంద రెడ్డి స్పాన్సర్ చేశారు. అలాగే, అత్యాధునిక ఆడిటోరియంను స్వాన్ టర్బిన్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి. సత్యనారాయణ–అరుణ స్పాన్సర్ చేశారని వెల్లడించారు. తన ప్రయత్నానికి సహకరించిన దాతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గత ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహాకం అందించి అభినందించారు. తన ప్రయత్నానికి సహకరించిన దాతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




## ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు తయారవ్వాలి..

ఈ సందర్భంగా ఐపీఎస్ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలో చదువుకున్న సమయంలో మా పాఠశాలలో ఓ స్వచ్ఛంధ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసిన అప్పటి కలెక్టర్ దమయంతిని చూసి స్ఫూర్తి పొంది ఆ దిశగా గట్టిగా ప్రయత్నించి నేడు ఈ స్థాయిలో ఉన్నానని అన్నారు. నేడు 'మహర్షి ఫౌండేషన్' పేరుతో చేసిన ఈ కార్యక్రమాలకు విచ్చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్, నన్ను స్ఫూర్తిగా పొంది మరో ఏడేళ్లలో ఏవరైనా ఐఏఎస్ లు, ఐపీఎస్ లు ఇక్కడి నుంచి తయారు కావాలని ఆయన ఆకాంక్షించారు. సొంత ఊరును.. చదివిన బడిని మరిచి పోకుండా తిరిగి ఐదైనా చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హసన్ పర్తి పాఠశాల అభివృద్ధికి కలెక్టర్, ఎమ్మెల్యేలు సహకరించాలని ఆయన కోరారు.


















## రూపేష్ సేవలు అభినందనీయం ..

### □ కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్యే నాగరాజు

ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్యే కే. నాగరాజు.. చెన్నూరి రూపేష్‌ను అభినందించారు. ఒక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని, ఐపీఎస్ అధికారిగా దేశానికి సేవ చేస్తున్న రూపేష్.. తన స్వగ్రామానికి, చదువుకున్న పాఠశాలకు చేసిన ఈ సేవ ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందని కొనియాడారు. విద్యార్థుల కోసం దాతలు ముందుకు వచ్చి భవిష్యత్తుకు బాటలు వేయడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ కార్పొరేటర్ జి. శివకుమార్, డీఐఓ గోపాల్, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ సునీత, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, సుమ పాల్గొన్నారు.


















# రైతుల అరిగోస..

- పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి
- రైతన్నకు అండగా నిలిచిన మాజీ మంత్రి ఎర్రబెల్లి
- అరెస్ట్ చేసిన పోలీసులు



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** రైతులకు సరిపడ యూరియా అందక అన్నదాతలు అరిగోస పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రైతన్నల ధర్నాకు మద్దతుగా నిలిచిన ఎర్రబెల్లి దయాకర్ రావును పోలీసులు అరెస్ట్ చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పోలీసుల తీరును నిరసిస్తూ ఎదురు తిరగడంతో ఎట్టకేలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ రేవంత్ సర్కార్ రైతులకు సరిపడా ఎరువులను గోదాములలో నిలువ చేయలేక ఫెయిల్ అయిందని ఆరోపించారు. 420 దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి రైతులను అరిగోస పెడుతున్నాడని మండిపడ్డారు. గత నెల రోజుల నుంచి ఐదు నుంచి పది ఎకరాల వరకు ఉన్న రైతన్నలకు ఒకటి, రెండు యూరియా బస్తాలు ఇస్తే పంటను ఏవిధంగా పండిస్తారో సీఎం చెప్పాలన్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి సిగ్గు తెచ్చుకొని రైతన్నలకు మేలు చేసే దిశగా అడుగులు వేయాలని, కేసీఆర్ అమలు చేసిన పథకాలను ఇంప్లిమెంట్ చేయాలన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ముందు చూపుతో ఆరు నెలలకు సరిపడ ఎరువులను ముందే గోదాములలో నిలువ చేస్తుండే వాడన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు పక్షాన పనిచేసినటువంటి గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. వరంగల్ జిల్లాలో రైతులు ఎరువుల కోసం అరిగోస పడుతుంటే చూడలేక పలుమార్లు కలెక్టర్లతో, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి ఎరువుల కొరత లేకుండా చూడాలంటూ వేడుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఎర్రబెల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకపోవడంతోనే యూరియా కోసం రైతులకు మద్ధతుగా ధర్నా చేయాల్సి వచ్చిందన్నరు. సమస్యకు పరిష్కారం చూపాలంటూ ధర్నాకి దిగితే అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు అందించే వరకు ఈ ఆందోళనలు ఆగవన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిని ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులతో కలిసి ముట్టడించేందుకు కూడా వెనకాడబోమని ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రకటించారు.



## హోంగార్డుకి ఆర్థిక చేయూత

### సహోద్యోగుల దాతృత్వం

**వరంగల్ వాయిస్, క్రైం :** హనుమకొండ ట్రాఫిక్ విభాగంలో హోమ్ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ సతీమణి ఇటీవల అనారోగ్యానికి గురైన స్థానిక హాస్పటల్ లో చికిత్స పొందుతూ కొద్ది రోజుల క్రితం మరణించింది. దీంతో వైద్య ఖర్చులు అధికమవడంతో హోంగార్డ్ శ్రీనివాస్ కు ఆర్ధికంగా భారం అయింది. దీంతో ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ సీత రెడ్డి పిలుపుతో స్పందించిన సహోద్యోగులు తమ వంతు సహకారం అందించగా రూ.72వేలను ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఈ పత్రాలను ట్రాఫిక్ ఏసీపీ సత్య నారాయణ చేతుల మీదుగా శుక్రవారం శ్రీనివాస్ పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేద హోమ్ గార్డ్ కుటుంబానికి ఆర్ధిక సాయం అదించిన ట్రాఫిక్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఇన్ స్పెక్టర్ సీతారెడ్డి, ఎస్సలు కొమురెల్లి, ఫసిద్దీన్, విజయ్ కుమార్ తో పాటు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## 14న ఎన్డీఏ, సీడీఎస్ పరీక్ష

- ముమ్మరంగా ఏర్పాట్లు
- జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్ సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో ఏర్పాటు చేసిన పలు పరీక్షా కేంద్రాలలో ఎన్డీఏ, సీడీఎస్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్ మాట్లాడుతూ హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సీడీఎస్ పరీక్ష, వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిలి మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్డీఏ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. ఉదయం 10 నుంచి 12.30 వరకు ఎన్డీఏ మొదటి సెషన్ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు రెండో సెషన్ పరీక్ష జరుగుతుందన్నారు. అదేవిధంగా అదే రోజున సీడీఎస్ పరీక్ష ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 వరకు రెండో సెషన్ పరీక్ష, సాయంత్రం 4 గంటలనుంచి 6 వరకు మూడో సెషన్ పరీక్ష జరుగుతుందన్నారు. సీడీఎస్ పరీక్ష కు 207 మంది, ఎన్డీఏ పరీక్షకు 410 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద, వాటి పరిసరాల చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాలలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు శాఖ అధికారులు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఏసీపీ నరసింహారావు, టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, పోస్టల్ శాఖ అధికారి శ్రీనివాస్, పింగిలి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, పరీక్షా కేంద్రాల సూపర్వైజర్లు, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## విచారణ చేయండి..
## తర్వాతే బిల్లులు చెల్లించండి

- కమిషనర్ కు చెరువుల పరిరక్షణ సొసైటీ వినతి

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** గణపతి నిమజ్జనం సందర్భంగా నామినేషన్ పద్దతిలో చేపట్టిన పనులను అసంపూర్తిగానే వదిలేసినందున విచారణ చేసిన తర్వాతే బిల్లులు చెల్లించాలని చెరువుల పరిరక్షణ సొసైటీ బాధ్యులు కోరారు. ఈ మేరకు చెరువులు పరిరక్షణ సొసైటీ అధ్యక్షులు పెరుమాళ్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు గుణిపాక క్రాంతికుమార్, పోతన వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సిలువేరు నగేష్ కుమార్ లు శుక్రవారం బల్దియా కార్యాలయంలోని ఉప కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా చెరువుల పరిసరాల్లో గుంతలను మొరం, కాంక్రీట్, డస్ట్ తో నింపేందుకు కాంట్రాక్టర్ లకు నామినేషన్ పద్దతిలో పనులు కేటాయించారన్నారు. అయితే వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో ఎక్కడ కూడా బల్దియా నిబంధనలకు అనుగుణంగా పనులు పూర్తి చేయలేదని ఆరోపించారు. దీంతో నిమజ్జనానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. నిబంధనలను పాటించకుండా తూతూ మంత్రంగా పనులను పూర్తి చేసిన వారికి బిల్లులు చెల్లించరాదన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేసిన తర్వాతే అందుకు అనుగుణంగా బిల్లులను చెల్లించాలని కోరారు.

## నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

- కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్
- పుల్లాయికుంట శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** పుల్లాయికుంట శ్మశానవాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన–పూర్ణచందర్ అన్నారు. పుల్లాయికుంట శ్మశాన వాటికలో మృతదేహాలను దహనం చేసేందుకు కొత్తగా నాలుగు ఓపెన్ బర్నింగ్ ప్లాట్ ఫారంలను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. శుక్రవారం పుల్లాయికుంట శ్మశాన వాటికలో నిర్మిస్తున్న ఓపెన్ బర్నింగ్ ప్లాట్ ఫారం పనులను కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ పుల్లాయికుంట శ్మశాన వాటికలో బర్నింగ్ ప్లాట్ ఫారాలు లేక మృతదేహాలను ఖననం చేయడానికి సౌకర్యంగా లేకపోవడంతో నూతనంగా నాలుగు ఓపెన్ బర్నింగ్ ప్లాట్ఫారాలను జీడబ్ల్యూఎంసీ నిధుల ద్వారా నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రజలు కాళ్లు కడుక్కోవడానికి, స్నానాలు చేయడానికి శ్మశాన వాటిక మెయిన్ గేటు పక్కన 10 నల్లాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు జీడబ్ల్యూఎంసీ ద్వారా నిధులను మంజూరు చేయించిన రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణిలకు గుండు చందన పూర్ణచందర్ కృతజ్ఞతలు తెలిపారు.



## అలుగుపోస్తున్న కటాక్షపూర్ చెరువు

- రాకపోకలకు అంతరాయం

ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ పెద్ద చెరువు అలుగు పోస్తోంది. దీంతో 163 జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మత్తడి దాటడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు మత్తడి ఉధృతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వరద ఉధృతి మరింత పెరిగినట్లయితే వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. దీంతో బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో.. వాహన దారుల కష్టాలు ఎప్పుడు తీరుతాయో అంటూ ప్రయాణికులు మదన పడుతున్నారు. – వరంగల్ వాయిస్, ఆత్మకూర్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com